# సరిహద్దులు

ప్రియుని ఆలింగనంలో చీకటి చిన్మయానందాన్ని పొందుతున్నట్టుగా ఉంది రాత్రి. వెన్నెల రేడు చీకటిని తనలో దాచుకుని పరవశంగా చూస్తున్నాడు. ఉత్తర పవనం ప్రేమసందేశాలని గొంతువిప్పి పాడుతూ పోతున్నది. మాతృత్వవాంఛతో వరిపైరు ఆ ఆహ్లాద వాతావరణానికి మైమరచి నాట్యం చేస్తున్నది. దూరాన పడమటి కొండల్లో పోడు కాలుస్తున్న మంటలు చెదురు మదురుగా కన్పిస్తున్నాయి. చెరకు తోటల్లో కాపలా కుర్రాళ్లు రాగాలు తీసి పాటలు పాడుకుంటున్నారు. రాత్రి పిట్టల అరుపులు, నక్కల ఊళలు, చెరకు తోటలమీంచి సవ్వడి చేస్తూ పయనిస్తున్న మారుతం, పైరు పాట — అన్నీ కమ్మని ప్రకృతి సంగీత కచేరీలా ప్రహ్లాదంగా ఉన్నాయి.

గ్రామానికి దక్షిణాన, ఫర్లాంగ్ దూరాన, ఆ చుట్టుప్రక్కల పంట పొలాలకు పదడుగుల ఎత్తున మెరక మీద, అక్కడొకటీ ఇక్కడొకటీగా ఉన్న చెట్లమధ్య, బహుళజ్యోత్స్నలో మెరుస్తున్న పూర్ణకుంభంతో దేవీమందిరం నిశ్చలసమాధిలో ఉన్నట్టు ప్రశాంతంగా ఉంది.

ఆ ఊరు, ఆ పరిసరాలు సూరన్న తాతకి కొత్త. ఆ రాత్రిపూట ఆ ఊరు రావాల్సి ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. జీవితంలో అన్నీ వింతలే. అనుకోని ఊహించని సందర్భాలే. ఆ ఉదయం సంఘటన కల్పించిన ప్రయాణం ఇది సూరన్న తాతకి.

మూడు పాతికల వయస్సు దాటిన సూరన్నతాతకు చేతికర్ర తోడయ్యింది. చీకట్లో బస్సు దిగిన సూరన్న తాతకు దారిచూపటానికి వచ్చిన యువకుడు ముందు నడుస్తున్నాడు. వాళ్ల చెప్పుల చప్పుడూ, కర్ర టిక్కూ టిక్కూ తప్ప మాటల్లేవు. మందిరానికి చేరువయ్యారు. 'అదే మందిరం. అక్కడే ఉంటాడు నీ మనవడు తాతా' అని ఆ యువకుడు తిరిగి వెనక్కి ఊళ్లోకి వెళ్లిపోవచ్చుకాని అట్లా పోలేదు. మందిరం పక్కనే ఉన్న గదిలో పూజారి నూకయ్యగారు ఉంటారు. ఆ గదిపక్కగా ఉన్న పాకలో ఉంటాడు మూర్తి. సూరన్న తాతను వాళ్లకు అప్పజెప్పి వెళ్లాలనుకుని... గజగజ లాడిస్తున్న చలి. ప్రయాణం బస్సులో రెండు గంటలే అయినా రెండు బస్సులు మారడం. రెండోబస్సు మధ్యలో చెడిపోవటంతో ఇంత రాత్రి అయింది.

సూరన్నతాతకి అప్పటికే విసుగొచ్చి 'ఇదేనా?' అని అడిగాడు.

'ఆ' అని ఆ యువకుడు మందిరానికి ఉత్తరంగా ఉన్న గదిముందు పూలమొక్కల దగ్గర నుంచొని 'నూకయ్య గారూ' అని పిలిచాడు.

మందిరం ముందు మంటపంలో నీడల్లాగ కన్పిస్తున్న రెండు ఆకారాలు కదిలాయి... ఆ పిలుపుతోనే ఎవరో కొత్తవాళ్లు వచ్చినట్టు తెలిసింది వాళ్లకు.

నూకయ్యగారు లేచి తలుపు తెరుచుకుని 'ఎవరు' అన్నారు గంభీరంగా. అప్పటికింకా ఆయన నిద్రపోలేదు. కొండగాలి చలికి జడిసి తలుపు మూసుకుని లోపలకూర్చొని ప్రార్థన చేసుకుంటున్నారు. అంతలో బైటనించి కేక.

'మేష్టారు కోసం ఈ తాతొచ్చారు'

'అలాగా... రండి... రండి లోపలికి' అని ఆహ్వానించారు.

'వెళ్తానండీ నూకయ్యగారూ' అని ఆ యువకుడు వెన్నెల్లో నీడై మాయమయ్యాడు అక్కడనుంచి.

* * *

'అవును మా తాతే!'

తనమీద పోట్లాటకే. ఇంటినించి వచ్చిన వాళ్లంతా తన తండ్రి పంపించిన మనుషులే. తిట్టి, భయపెట్టి, శపించి, నిందారోపణలు చేసి, మరిన్ని మంటలు రేపి వెళ్లినవాళ్లే. అందువల్ల తాత ఈ రాత్రిపూట రావటం చూసి మూర్తి ఆశ్చర్యపోయాడు. తనను పిలిపించుకుని మాట్లాడవలసిన తాతయ్య తనను వెతుక్కుంటూ ఈ ఊరు రావటం తగువు కోసమే అని మనసు భయపడింది.

'ఎందుకొచ్చారు' అంది కారుణ్య. ఆ పలకటంలో ఆకర్షణ ఉంది. ఆమె తెలుగు ఉచ్ఛారణ తెలుగుభాషకి అందం తెచ్చిపెట్టింది. చిన్నపిల్లలు మాటలు నేర్చుకుంటున్న

కొత్తతనం ఆ పలకటం.

'ఒక్కసారి పాతకథలు జ్ఞాపకం తెచ్చుకో... ఎందుకొస్తారో నీకే తెలుస్తుంది'.

'మీరు అనుకున్నట్టే...'

మండపం దక్షిణం మెట్లు తోటలోకి. వాళ్ళు ఆ కింద మెట్లమీద కూర్చున్నారు. ఇంతసేపు అతడి ఒడిలో తలపెట్టుకుని అతడి కళ్లనీ, ఆకాశంలో తారకల్నీ చూసుకుంటూ ఒక ఒరియా పాట పాడి దాని అర్థం చెప్పింది కారుణ్య.

'అయితే...' అని సహజమైన సంశయాన్ని స్త్రీ హృదయంలోని ప్రేమతో అశ్రువొకటి రాల్చినట్టుగా అడిగింది. ఆమె భుజాన్ని పట్టుకున్న అతడి చేతిస్పర్శతో అభయం ఆమె గుండెలోకి చేరినట్టయింది.

ఆ కిందిమెట్టుకు పదిగజాల దూరాన దక్షిణంగా మందిరాన్ని నిర్మించిన భక్తుని సమాధి. ఆచుట్టూ పూలమొక్కలు. పొదలు పొదలుగా మందారాలు. తెరలు తెరలుగా పుష్పపత్ర సుగంధాలు.

'ఇదంతా మామూలే' అని ఏ ఒత్తిళ్లకూ చలించని నిబ్బరం. ఓ పక్క తన అంతరంగం అంతటా ప్రియురాలి అమాయకత్వం పట్ల ప్రేమ.

ఆమెకు ధైర్యం చిక్కింది. అతడి కుడిచేతిని తన రెండుచేతులతో పట్టుకుని కారుణ్య తన తరపునుంచి అతడికి మరింత బలాన్నిచ్చింది.

'ఇపుడు నువ్వు కన్పించావంటే ఎలా ఉంటుందో తెలుసుకదా?'

మూర్తి ఇంటినుంచి వచ్చేవాళ్లంతా... ముందు తిట్టేది ఆమెనే. ఈ ముండ వల్లనే చెడిపోయాడనీ తండ్రినీ, కుటుంబాన్నీ, ఆస్తులతో వస్తున్న పెళ్లి సంబంధాలనీ కాదని ఎదురు తిరిగాడని. నయాన చెప్పారు భయాన చెప్పారు అయినా వినలేదని.

తన ఆస్తినెవరో దోచుకునేందుకు వచ్చారన్న ఆవేదనే ఆమె అంతర్గతం అని తెలుసుకుని అనునయంగా వీపుతట్టాడు మూర్తి.

'సహించలేరు. శత్రువును చూసినట్టుచూస్తారు. పనికిమాలిన వాడుగానూ, భ్రష్టుడుగానూ తయారయినాడని, పాడైపోయాడని, చెడిపోయాడని జాలిపడతారు. సనాతనాచారాలు, కులాభిమానాలు తప్ప కొత్త ఏదీ వాళ్లకు సరిపడదు. కులాంతర ప్రేమ వివాహాలు, స్వేచ్ఛ, వరకట్న వ్యతిరేకం ఇవేవీ కిట్టవ్. ప్రతిపనికి ఆటంకాలే. చిన్నచిన్న విషయాల్లో సైతం ఇంట్లో పోట్లాటలే. పెద్దవాళ్లు చెప్పినట్టు నడుచుకోవాలి. వాళ్లు కాదన్నది చేయకూడదు. వాళ్ల అనుమతి లేకుండా స్వతంత్రంగా ఏ పనీ చెయ్యకూడదు. వాళ్ల ఆజ్ఞ దాటకూడదు. వాళ్లు ఆడమన్నట్టల్లా ఆడాలి...' అని మూర్తి తనను సమర్థించుకుంటున్న ధోరణిలో మాట్లాడి ఆమెకు ధైర్యవచనాలు చెప్పాడు.

ఇప్పుడు సూరన్నతాత వచ్చింది కూడా పోట్లాటకే. ఆ పోట్లాట తన మీద కాదు. ఆమె మీద ఉంటుంది. విసరే ఆయుధాల్ని ఆమెకే గురిపెట్టారు. మూర్తికి కోపం ఈ కారణంగానే. తనతో పోట్టాడితే సరే తప్పు లేదు. కాని అట్లా ఉండదు.

ఇంతలో నూకయ్యగారు బయటికి వచ్చారు. పొయ్యి వెలిగిస్తున్నట్టుంది. పక్కగదిలో వెలుతురు. నిద్రపోతున్న దండాశిని నిద్రనించి లేపినట్టుంది. నూతివేపు వెళ్తున్నాడు. గుడికి వాయవ్యంగా పాతిక గజాలలో నుయ్యి. వంటకీ వార్పులకీ నీళ్లు ఎప్పటికప్పుడు తెచ్చుకోవటమే.

'భోజనంకోసం వంట ఏర్పాట్లు చేస్తున్నట్టున్నారు' అందామె. ఆమె చేతి గాజులు గలగలలాడాయి. హరికేన్ లాంతరు వెలిగించి గదిలో పెట్టారు.

'నేను వంటపని చూస్తాను. మీరు వెళ్లి తాత గారిని కలుసుకోండి.' అని కారుణ్య లేచి నుంచుంది. చీర సర్దుకుని, జుత్తు ముడి వేసుకుని ఆమె కదులుతున్నప్పుడు 'చూడు కారుణ్యా, తాత — చాలామంచి వాడు. తాతకు నేనంటే ఎంతో ఇష్టం... అయినా కోపంతో — ఏమన్నా అంటే పట్టించుకోవద్దు. తాతయ్యతో ఎలా మాట్లాడాలో నాకు తెలుసు.' అని ఆమె చేతులు పట్టి ఆపి అనునయంగా చెప్పాడు. ఆమె వినిపించని నవ్వు నవ్వుకుంది.

పుష్ప సుగంధాలు శీతల పవనాలను పెనవేసుకున్నాయి.

'కారుణ్యా' అని మాటలకు తడుముకున్నాడు మూర్తి. 'ఈ ఆదర్శాలూ, స్నేహాలూ ప్రేమలూ —వీటి గురించి చెప్తే అర్థమవుతాయంటావా? అందుకే నేనేమీ ఈ సారి మాట్టాడదలచుకోలేదు. ముఖ్యంగా తాతయ్యతో.

పుష్ప సౌరభాలు శీతలసమీరంనించి విడిపోయాయి. వెన్నెల ఆనందంలా అనంత ప్రకృతిని ఆవరించింది.

గదితలుపులు తెరచుకుని లోపలికి వచ్చాడు మూర్తి. మంచం మీద కూర్చున్న సూరన్నతాత ముఖం తిప్పి చూశాడు. ఏ ప్రేమా ఏ అనురాగమూ ఏ అనుబంధమూ తెలీని పొడి చూపది. పొడుగాటి పాటాకు చుట్ట కాలుస్తున్నాడు తాత. గదిలోని కోడిగుడ్డు దీపం వెల్తురులో వెలుగునీడల్లో అలసటతో కన్పించాడు తాతయ్య మూర్తికి. కళ్లు మెరుస్తున్న నిప్పుల్లా ఉన్నాయి.

కిటికీ లోంచి గదిలోపలికి చూస్తే కారుణ్యకు కన్పించిన దృశ్యం అది.

'మీరు వెళ్లి లోపల తాతగారితో కూచోండి నూకయ్యగారూ'

ఈ ముసలితనంలో చిన్నపిల్లవాడి లాంటి ఈ ఉత్సాహం ఆ దేవీదే అంటారు నూకయ్యగారు. ఆ మాటలు గుర్తొస్తాయి. వారి చేతిలోని బియ్యం గిన్నెని

తీసుకుందామె. ఎసరు పొయ్యిమీద ఉంది. కడిగి బియ్యం పొయ్యాలి.

'మూర్తి లోపలికి వెళ్లాడా ?' అడిగారు నూకయ్యగారు. ప్రశ్న అడుగుతూనే లోపలికి చూస్తే తాతగారి ఎదురుగా నేలమీద కూర్చున్న మనవడు కనిపించాడు కిటికీలోంచి.

పొడిపొడిగా కుశల ప్రశ్నలు నడుస్తున్నాయి. ఎవరూ మాటలు పొడిగించటం లేదు. సూరన్నతాత అలసిపోయినందువల్ల అనురాగాల ఆర్ద్రత ఆరిపోయినట్టు కూడా ఉంది. లేదా ఇక్కడ ఇప్పుడు ఆ ప్రేమలన్నీ అప్రస్తుతం అనిపించాయో ఏమో ఆఁ ఊఁ లతోనే సమాధానం చెప్తున్నాడు సూరన్నతాత. అన్నీ చూస్తున్నది కారుణ్య. వంటపని సాగుతున్నది.

మూర్తికి రాబోయే ప్రతిక్షణమూ — విపత్తు విరుచుకు పడబోతున్నట్టు ఉంది. నిజానికి తాతయ్య ఇక్కడకు రావలసిన సందర్భం కాదు. అయినా వచ్చాడు. తాతయ్య అంటే ఇష్టం. తాతయ్య అంటే ప్రేమ. తాతయ్య అంటే సంతోషం.

సూరన్నతాత గురించి మూర్తి చెప్పిన ముచ్చట్లన్నీ గుర్తొస్తున్నాయి కారుణ్యకి.

నూకయ్యగారు మందిరం దక్షిణంగా ఉన్న తోటలోకి వెళ్లారు. టమేటోలు కోసం. తాతయ్యకూడా వాళ్లతో చేరాడా? తన పక్షాన మాటాడి వాళ్లకి బుద్ధి చెప్పవలసిన వాడు తనతో పోట్లాట పెట్టుకోవటానికి వచ్చాడా ? తల్లి లేని వాడన్నప్రేమ ఇప్పుడు ఈ పెళ్లితో పోయిందా? తన ముద్దుల కుమార్తె పట్ల ప్రేమతోనన్నా — తను ఆరాధించి, జీవితంలోకి స్వీకరించిన తన అందాల వెలుగుని, జన్మజన్మల తన అనుబంధాన్ని తన జీవితభాగస్వామిని, ఆశీర్వదించలేడా. తాతయ్యకూడా డబ్బూ, కట్నాలూ, ఆస్తులూ — వీటి కోసమే కక్కుర్తిపడుతున్నాడా? ఎనభయ్యోపడిలో సైతం స్వంతంగా ఆలోచించుకో లేడా? ఏ భయాలకూ, ఏ ఒత్తిళ్లకూ, ఏ ఆకర్షణలకూ, ఏ బంధాలకూ లొంగకుండా ఎదురు తిరిగి నిలబడినందుకు తన స్వేచ్ఛా వ్యక్తిత్వంపట్ల గర్వాతిశయం పెంచుకున్న మూర్తి — తాతయ్య దగ్గర తలవంచుకున్నాడు. మౌనంగా కూర్చున్నాడు. తాతయ్య మాటాడినా, ఏమ్మాటాడుతాడో... ఇంట్లో అంతా తన మీద కత్తికట్టారు. దానిక్కారణాలు ఉన్నాయి. అమ్మ చనిపోయినప్పుడే తన సర్వస్వం పోయింది. అదికూడ తను రెండేళ్లవాడుగా ఉండగా ఆ ఇంట్లో మనుషులు, వాళ్ల నిర్బంధాలు, వాళ్ల అహంకారాలు, వాళ్ల అల్పత్వాలు అమ్మని తినేశాయి. ఆత్మహత్య చేసుకుంటే తప్ప అమ్మకి విముక్తి కలగలేదు. తనకు మాత్రం ఈ రాక్షసుల్ని ఎదిరించు లొంగకు... అని మరీ అమ్మ బోధిస్తున్నది. ఇప్పటికీ తాతయ్య ముందు తనకు ఓటమి ఉండదు. కారుణ్యని

చూసిన తర్వాత కంటనీరు పెట్టుకోడా? తన కూతురు, ఇదే వయసులో నూతిలోపడి చనిపోయిన తన కూతురు, గుర్తు రాదా... అమ్మా అని తన గుండెల్లోకి తీసుకుని కారుణ్య కన్నీళ్లని తుడిచి ఓదార్చలేడా... పూలతోటలో పుట్టినసౌందర్యపరిమళం నా కారుణ్య... నాకోసం ఈ పృథ్వీతలానికి వచ్చిన దేవతాంగన నా కారుణ్య తాతయ్యా అని చెప్పి —తాతయ్య పాదాలమీద పడి ఆశీర్వదించమనాలని ఉంది.

మూర్తి కళ్లల్లో, ముఖంలో, కదలికల్లో కనిపిస్తున్న సంఘర్షణను చూసి తెగి రాలిపోతున్న ఆకులా కొట్టుకుంటున్నది కారుణ్య. తన ప్రియుడు ధీరుడు... అదీ ఆమె ధైర్యం. ఇప్పుడు తాతయ్య ముందుమాత్రం మౌనంగా కూర్చున్నాడు. ఇద్దరూ మౌనంగానే ఉన్నారు. ఇద్దరి హృదయాల్లోనూ ఘర్షణలు భీకరంగా సాగుతున్నట్టే ఉంది ఆ దృశ్యం కారుణ్యకి. ఇంకో సమయంలో అయితే పిలిచి ఎన్నో కబుర్లు చెప్పేది. కాని ఏ హద్దునో ఇప్పుడు ఆమె అతిక్రమించలేకపోతున్నది.

తాతయ్య ఇంకో పరిస్థితిలో వస్తే ఎంత మురిసిపోయేవాడో! ఎంత ఉప్పొంగి పోయేవాడో! ఈ చిన్న ఊళ్లో తను ఉపాధ్యాయుడు. పిల్లలూ, పిల్లల తల్లిదండ్రులూ తనపట్ల చూపుతున్న ఆదరణ, తన ప్రయోజకత్వం — తాతయ్య ఎంత సంతోషపడేవాడో. కాని ఇప్పుడు ఈ సందర్భంలో అవేవీ కన్పించవు. ఆ విలువ లేవీ నిలవ్వు.

గది నిండా చుట్టపొగ వాసన. ఆ వాసన మూర్తికి ఇష్టం. చిన్నతనంలో తాతయ్య ఆ చుట్ట పొగనోటితో ముద్దుపెట్టుకునేవాడు తనని. మీసాలు గుచ్చుకునేవి. ఆ గెడ్డం ఎప్పుడూ గరుగ్గా ఉండేది. రాత్రి పూట అన్నం తిన్న తర్వాత తాతయ్య దాదాపు జానెడుపొడుగు లావుపాటి చుట్టని చేతికిచ్చి పొయ్యిదగ్గర వెలిగించి రమ్మనేవాడు. నోట్లోపెట్టుకుని పొయ్యిదగ్గర — లోపల్నించి కాలుతున్న కట్టెముక్క తీసి, చుట్ట వెలిగించి, ఆ పొగ గుప్పు గుప్పున పీల్చి వొదులుకుంటూ – తీసుకుపోయి తాతయ్య చేతికిచ్చేవాడు.

చుట్ట కాల్చటం పూర్తయ్యేసరికి మనసు చక్కబడినట్టుంది. ప్రశాంతంగా కనబడింది తాతయ్య ముఖం. ముందు అన్నం తినసీ అని వంట ఎంత వరకు వచ్చిందీ చూట్టానికి గదినించి బయటకు వచ్చాడు మూర్తి. వంటపొయ్యి ఉన్న పక్కగదిలోకి వెళ్లి 'మీరు వెళ్లి మాట్లాడండి నూకయ్యగారూ, నేను ఈ పని చూస్తా' అంటూ వారి చేతిలోని టమేటోలు అందుకొని వంట పొయ్యి సమీపంలోనే కారుణ్య ముందు పీట మీదకూర్చున్నాడు మూర్తి. అప్పటికి మౌన యుద్ధమొకటి ముగిసినట్టయింది. తాతయ్య నోరు తెరవకుండా చేసి తాను తన ప్రేమతో



కథా నిలయం
5817
శ్రీకాకుళం

తాతయ్యమీద తొలి దాడిలో నెగ్గినట్టు సంతోషపడ్డాడు మూర్తి. మనసంతా ఇరుగ్గానూ, ఊపిరాడనట్టుగానూ ఉక్కిరిబిక్కిరయిన మూర్తికి బయటకి వచ్చి గుండెనిండా గాలి పీల్చుకుని నిండుగా నిట్టూర్చాడు.

తను నిద్రపోవాల్సిన మంచాన్ని సూరన్న తాతకి ఇచ్చేసి, నూకయ్యగారు కింద నేలమీద గోడవేపు చాప, దానిమీద బొంతా పరచుకుని కూర్చున్నారు. వేడినీళ్లతో కాళ్లూ చేతులూ ముఖమూ కడుక్కుని ఓ చుట్ట కాల్చేసరికి సూరన్నతాతకి ప్రయాణం బడలిక తీరిపోయింది. తనముందు ఇంతసేపు శాంతంగా కూర్చున్న తన చేతులు మీద పెరిగిన — తల్లి చనిపోయిన తర్వాత తన గుండెలమీద పెరిగిన మనవడ్ని చూట్టంతో మనసంతా చల్లబడింది.

కొండల మధ్య ఈ పల్లెటూరు గురించీ, ఇక్కడ కొండలనించి వచ్చే మన్యం రొజ్జగాలి చలిగురించీ, చుట్టూ ఉన్న చెరుకుతోటల్లో పాటలు పాడుకునే కాపలా మనుషుల గురించీ మాటాడి నూకయ్యగారు 'తాతయ్యంటే మీ మనవడికి ప్రేమ. మీ గురించే చెప్తుంటాడు...' అన్నారు.

మనసు తెగించి కూతురు చచ్చిపోయింది. అనరాని మాట అన్నారని కోపంతో, పౌరుషంతో, అత్తవారింట తనకు జరిగిన అన్యాయం తర్వాత బతుకు మీద ఛీత్కారంతో, నూతిలో పడి ప్రాణ త్యాగం చేసుకుంది... రెండేళ్లు కూడా నిండని పసిపిల్లవాడిని విడిచిపెట్టేసి... ఆ పసిపిల్లవాడిలో కన్నకూతుర్ని చూసుకుంటూ... వాడిని మురిపెంగా పెంచుకున్న జ్ఞాపకాల్తో చాలాసేపు మూగ బోయాడు సూరన్నతాత. ఇప్పుడు మళ్లీ మనవడు పసిపిల్లవాడిగానే కన్పించాడు... ముద్దు ముద్దు మాటలే విన్పించాయి.

పెళ్లికి సంబంధించి తండ్రీ కొడుకులు మధ్య లేచిన వివాదం చిలికి చిలికి గాలివానయి పగలకూ పట్టింపులకూ దారితీసింది. కక్షలూ కార్పణ్యాలూ మొదలయ్యాయి. తండ్రి తన అమ్ముల పొదిలోని ఆయుధాలన్నిటినీ వదులుతున్నాడు. ఇప్పుడు సూరన్నతాతని సంధించింది అదే వ్యూహంతో... ఆ కథ మొత్తం తెలిసిన నూకయ్యగారు,

'పిల్లలు... వాళ్ల సంతోషమే మన సంతోషం కాదా... పట్టూ విడుపూ లేకుండా...' అని ఇంకా వివరంగా చెప్పాలని మాటలకోసం ఆగారు.

మూర్తి రెండేళ్లుగా — ఉపాధ్యాయుడుగా ఈ ఊరు వచ్చినప్పటినించీ తన దగ్గరే ఉంటున్నాడు. అతడు చూపించే పితృభావంతో మూర్తితో అనుబంధం ఏర్పడింది. ఆ కారణంగా కూడా ఇప్పుడు సూరన్నతాత పట్ల నూకయ్యగారికి తనకు

తెలీకుండానే ఆత్మీయభావం. ఆ చనువు తీసుకుని ఈ వివాదంలో ఆయన తల దూర్చారు.

'అలాగన్నారా స్వామి' అని సూరన్నతాత ఇంకా పొడిగించటానికి సందు ఇవ్వకుండా కల్పించుకొని, కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు.

తాతయ్య సంభాషణలు తరచు ఉపమానాలతో, సామెతలతో, పొడుపు కథలతో, ఉదాహరణలతో సాగుతాయి. మాటలు, ఉపమానాలు, ఉదంతాలు ఒక పద్ధతిలో పెట్టుకోవటానికి ఈ వ్యవధి.

'ఆబోతు — స్వామీ, వింటున్నారా?— ఆబోతు వయసులోకి రాగానే తండ్రి ఆబోతును ఏంచేస్తుంది స్వామీ?' మెల్ల మెల్లగా ఒక్కొక్క పదమూ పట్టి పట్టి మాటాట్టం సూరన్నతాత పద్ధతి. ఆ ప్రశ్నవేసి నూకయ్యగారి కళ్లల్లోకి చూశాడు సూరన్నతాత. వారిద్దరి ముఖాలూ కన్పించాయి కారుణ్యకి.

'అవును' అన్నారు నూకయ్యగారు. ఊ చెప్పిండి అన్న ఉద్దేశంతో.

'అది పశువు గుణం —అవునంటా రా స్వామీ?'

'ఆ అయితే'

'మనం మనుషులం. అలాగే —వినండి స్వామి —అలాగే ప్రవర్తిస్తే మనకీ వాటికీ భేదం ఎక్కడ?'

తను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని తండ్రితో చెప్పిన తర్వాత ఆ నెపంతో రగిలిన కయ్యానికీ ఇప్పుడు తాతయ్య చెప్తున్న పశుగుణానికీ ఎక్కడా సామ్యం కనిపించలేదు కారుణ్యకి. ఆ ప్రశ్నకి సమాధానం తను చెప్పాలనుకుంది. పశువులకు ఉన్న చాలా సుగుణాలు మనుషులకు లేవని, పశువుల్నించి మనుషులు నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయని తిప్పికొట్టాలన్నంత ఉద్రేకం వచ్చిందామెకు. అంతలోనే మనసు చల్లారి పోయింది. పొయ్యిమీద ఎసరు — పరధ్యానంలో ఉండగా — పొంగి పొయ్యిలోని మంట సుయ్యిమంది.

తను తండ్రిని మోసగించాడా? ఆబోతులా రంకెవేసి కాలుదువ్వాడా?

'స్వామీ వినండి... ఈనాడు నాకూతురు — చచ్చిపోయి స్వర్గానుంది'

తల్లి భౌతికరూపం సైతం గుర్తులేదు — అయినా ఆ మాతృప్రేమ మాత్రం అతడి గుండెలో శాశ్వతంగా మిగిలిపోయింది.

'దాన్ని ఈనాడు నా అల్లుడు — కొడుకు మీద కక్ష తీర్చుకోవటానికి — వింటున్నారా స్వామీ... కాకి గూట్లో కోకిల గుడ్లు పెట్టింది కాబట్టి — మనసుపెట్టి వినండి స్వామీ — ఆకోకిల పిల్ల పెరిగి పెద్దదై — కాకిని విడిచిపెట్టి వెళ్లిపోయింది

అంటున్నాడు. స్వామి — నాకు తెలుసు — ఆ పరమాత్ముడికి తెలుసు నిజం...'

ఆ చిన్న సామెతతో కథంతా అర్థమయింది నూకయ్యగారికి.

తన భార్య, కూతురూ గుర్తొచ్చారు ఆయనకు. పూర్వాశ్రమంలో రైల్వేడ్రైవర్‌గా పనిచేసిన నూకయ్యగారు పదవీవిరమణ తర్వాత తన గురువు మీద ప్రేమతో వచ్చి, గురువు మరణానంతరం ఇక్కడ దేవీ పూజారి అయ్యాడు. అయినా వేషంలో పెద్దగా ఏమార్పు లేదు. పాతకాలం నాటి రైల్వేడ్రైవర్ ఫోటో ఒకటి ఆగదిలో ఉంది. అప్పుడు పేంట్, షర్ట్‌లు ఇప్పుడు లేవు. టైలర్ కుట్టిచ్చిన బనియను, పంచెకట్టు అంతే. రోజూ గెడ్డం గీసుకుంటారు. క్రాఫ్. మందిరం పూజ సమయంలో మాత్రం ఎర్రరంగు పట్టుపంచె కట్టుకుంటారు. తర్వాత మామూలు బట్టలే.

బయట కుక్క దారిన పోతున్న ఎవర్నోచూసి అరచింది. దండాశి కల్పించుకుని వంటకు నీళ్లుతేవటం, కట్టెలు లోపల పొయ్యి దగ్గర వెయ్యటం వంటి పనులు చేసుకుంటున్నాడు.

స్త్రీపై సహజంగా రుద్దే మాలిన్యం దుర్గంధానికి కారుణ్య తట్టుకోలేక పోతున్నది. మూర్తి జడుడయ్యాడు. తన తల్లి తనకు దేవత. చనిపోయిన తన తల్లి అంటే అతనికి ఈ విశ్వం.

తనను లొంగదీసుకోలేకపోయిన పరాజయంతో తండ్రి మరింత దిగజారి పోయాడు. తాతయ్య చెప్పిన సామెతతో ఉగ్రుడయ్యాడు మూర్తి. మనసులో ఉవ్వెత్తున లేచిన ఉద్రేకంతో తట్టుకోలేక పోతున్నాడు. తండ్రితో కయ్యం చల్లారేట్టు కనిపించడం లేదు. రోజుకో కొత్తరూపుతో మరింత వికృతం అవుతున్నది.

క్రమంగా వెన్నెల మరింత ప్రకాశవంతమైంది. చెరుకు తోటల్లో ఎక్కడో ఎలుగుబంటి ప్రవేశించినట్టుంది. దూరాన డప్పులు మోగిస్తూ అదరగొట్టున్నారు కాపలా మనుషులు. ఆ డప్పులు మోత ఇటు మందిరం వేపు వస్తున్నట్టుంది.

'స్వామీ ఇంకొకమాట చెప్తాను వింటారా?' అని సూరన్నతాత ఆగిపోయాడు.

'మా పెద్దమ్మ కొడుకు — నా వయసువాడే — ఉండేవాడు. వాడంటే ఊళ్లో జనంకి భయం. గౌరవం. మాటమీద నిలబడేవాడు. ఎవర్నీ కష్టపెట్టేవాడు కాదు. ఎవరు తప్పు చేసినా ఒప్పుకునేవాడు కాదు. అలాంటి మనిషి కూడా —స్వామీ చెప్తే నమ్మరు —మందెట్టేసింది ఓ లంజ... అప్పటినించి ఆ గడపదాటి క్షణం బయటికి వచ్చేవాడు కాదు...'

కారుణ్య అమృతహృదయంలో విషశరం గుచ్చుకున్నట్టయింది. మరణవేదనతో ఆమె కళ్లనించి అశ్రువులు రాలుతున్నాయి. మందెట్టేసింది ఓ లంజ —అన్నమాటలు

పదేపదే నాటుకుంటున్నాయి

అలాంటి విషపుమాటలు ఇది వరకు చాలాసార్లు విన్నందువల్ల కారుణ్య సహనం అలవర్చుకుంది.

మూర్తి ఆ లంజ అన్న స్త్రీ గురించి ఊహిస్తున్నాడు. ఆమె ఎంతగొప్పదో. ఎంత ఉన్నత కళాహృదయమో? రూపవతో? ఆమె సాన్నిధ్యంలో ఏ ఆకర్షణ బంధించిందో? ఏ గానం విన్నాడో? ఆమె మాటల్లో ఏ ప్రేమని తెలుసుకున్నాడో? ఏ తేజస్సును చూశాడో? ఏమో! ఆ ప్రేమికుల పట్ల మూర్తికి గౌరవాభిమానాలే ఏర్పడ్డాయి.

'స్వామీ కొమ్ములొచ్చాయని ఈనాడు —'

సూరన్నతాత మాట పూర్తి చేయలేదు...

ఈ మాటలు తాతయ్య నోటినుండే వస్తున్నాయా... ఆశ్చర్యపోతున్నాడు మూర్తి. ఈ బంధుత్వాలకు దూరంగా పోతున్న కొద్దీ అవి మరిన్ని గొలుసుల్ని బిగిస్తాయి. జీవితాలను వ్యర్థం చేస్తున్న ఈ సంబంధాలను క్షాళన చేస్తే తప్ప తనకు శాంతి ఉండదను కుంటున్న మూర్తి పట్టుదలకు ఎప్పటికప్పుడు గడ్డు పరీక్షలు. తాతయ్య ఎందుకు రావాలి? ఇన్ని నీతులు బోధిస్తున్న తాతయ్య తన కొడుకును సన్యాసుల్లో చేరిపోకుండా కాపాడుకోలేకపోయాడెందుకని. ఒంటరి వాడయిపోయి అక్క గడపను చేరి జీవచ్ఛవంలా బతుకుతున్న తాతయ్య తత్వ బోధ చేస్తున్నాడు. ఓపిక నశించిపోతున్నది. అయినా సరే తాతయ్యకు ఎదురు మాటాడటం ఊహూ వద్దు... అనుకున్నాడు మూర్తి.

'ఇవాళ నా అన్నవాళ్లని దూరం చేసుకుని —నాకెవరూ వొద్దనుకుంటే—'

తనకు నచ్చచెప్పటానికే ఈ మాటలన్నీ అన్న సంగతి స్పష్టంగా తెలుస్తూనే ఉంది మూర్తికి. ఇది ఇంకా నాందీ వచనమే. అయితే తాతయ్య గొంతులో శాంతం ఉంది. ప్రేమ ఉంది. తనలోని దుఃఖాన్ని కక్కలేక మింగలేక — తాతయ్య ఇబ్బంది పడుతున్నాడు.

చిన్ననాడే తల్లిని కోల్పోయిన తనకు — ప్రపంచంలో నా వాళ్లు అంటూ ఎవరుంటారు —

వంటయింది. నూకయ్యగారు భోజనం ఏర్పాట్లకోసం లేచారు. భోజనాలు పక్క గదిలోనే. ఆ ముసలాయన కాస్త తిండి తినాలంటే తాను కొంచెం దూరం ఉండటం మంచిదేమో అని కారుణ్య మండపం వేపుగా నడుస్తున్నది. బయట అడుగు పెట్టిన సూరన్నతాత ఆ అమ్మాయిని చూశాడు... వెన్నెల్లో వేలాడుతున్న పూలదండలా

కన్పించింది.

అన్నం వేడివేడిగా. పప్పు. టమేటాకూర. మూడే. మజ్జిగా పెరుగూ రాత్రిపూట ఉండదు. నూకయ్యగారే స్వయంగా వడ్డించారు. సూరన్నతాత ఇష్టంగా తింటున్నారు. పక్కనే నుంచున్నాడు మూర్తి. వాళిద్దరే ఉండటం మంచిదనుకుని మూర్తి బైటకి వచ్చేసి మండపం వేపు కారుణ్య దగ్గరకు వెళ్లాడు.

రొజ్జగాలి విజృంభించింది.

ఉద్యోగం చేస్తున్న అన్నయ్యతో పాటు కటక్‌లో చదువు. వదిన వచ్చాకా అన్నయ్య ప్రవర్తనలో మార్పు. మామయ్య విశాఖ తీసుకుపోవడం. అప్పట్లోనే తెలుగు నేర్చుకోవడం. కాలేజీ చదువులో మూర్తి పరిచయం. ఉద్యోగం కోసం బరంపురం రావడం. పై ఆఫీసర్ మానసిక చిత్రహింస... పోట్లాట. రాజీనామా చేసి తల్లి దగ్గరకు పల్లెటూరు. మూర్తి స్నేహం. గుళ్లోపెళ్లి. రెండేళ్లయ్యింది. అయినా మూర్తి దగ్గరకి రావటం ఏడాది కిందటే. అప్పట్నించీ మూర్తికి ఇంటి వాళ్లతో ముఖ్యంగా తండ్రితో పోట్లాటలు. తల్లి రెండు నెలలు కిందట చనిపోయింది. జబ్బుమనిషి తండ్రి అన్నయ్య దగ్గర. ఆ జ్ఞాపకాలు. జీవితం ఇప్పుడు ఇక్కడ ఈ దేవీ మందిరం దగ్గర. పూజారి గారు ఉంటున్న రెండు గదుల్లో ఒకటి తమకి ఇచ్చారాయన. వంటకోసం, సామాన్ల కోసం కొత్తగా తమ గదికానుకునే ఇప్పుడు ఈ సాలగది. గోడలు లేవు. తడికెలు చుట్టూ. ఆ గదిలో ఆయన పడుకుంటారు. మందిరం సేవకుడు దండాశి. వాడికి ఊళ్లో భార్యా, పిల్లలూ, ఇల్లూ ఉంది. అయినా వాడు ఇక్కడే పూజారి గారితోనే ఉంటాడు.

భోజనం ముగిశాకా మరో పెద్దచుట్ట తీసి వెలిగించాడు సూరన్నతాత.

గదిలోంచి తీసుకురమ్మన్న శాలువను కారుణ్యకిచ్చి ప్రక్కగదిలో బొంత పరుచుకుని పడక వేశాడు దండాశి. నూకయ్యగారు తన గదిలో ప్రార్థన చేసుకుంటున్నారు.

సూరన్నతాత సగంకాలిన చుట్టని ఆర్పేసి నేలమీద పెట్టి మంచం మీద సాగిలబడ్డాడు.

'కారుణ్యా ! తాతయ్య అలసిపోయినట్టున్నాడు. పడుకుంటున్నాడు. కాని జాగ్రత్త. ఇంకా చాలా రకాల మాటలొస్తాయి. తన బాణాలు తన దగ్గరే ఉంచు కున్నాడు. నువ్వు వినీవిననట్టు ఊరుకో. ప్రతిమాటనీ మనం పట్టించుకుంటే — బాధపడతాము...' అని మూర్తి కళ్లనీళ్ల పర్యంతమై బతిమాలాడు.

సూరన్నతాతకు నిద్ర ముంచుకు వస్తున్నది. కాళ్లు పీకుతున్నాయి. బస్ చెడింది.

ఆరు కిలోమీటర్లు పొలంగట్ల దారిలో నడిచి వచ్చాడు. పదేళ్ల కిందట వరకు కూడా ఈ నడక ఒక లెక్కలోనిది కాదు. కాని ఇప్పుడు అలసిపోతున్నాడు. తన వయసులో ఏకబిగిని ఇరవైక్రోసులు ఆడుతూ పాడుతూ నడిచేసేవాడు. కాని ఇప్పుడు... ముసలితనం లొంగదీసుకుంది. తాతయ్య తన మోకాళ్ల పిక్కలు తానే నొక్కుకోవడం చూసి కారుణ్య తాతయ్య పడుకున్న గదిలోకి తలుపు నెట్టుకుంటూ వచ్చింది. ఆమె అట్లా లోపలికి పోవటం చూసి మూర్తి ఆశ్చర్యపోయాడు. ఈ రాత్రికి కారుణ్యా తాతయ్య దృష్టికి దూరంగానే ఉంచి రేపు ఉదయం 'ఇదుగో మనఇంటికోడలు. నీ మనుమరాలు' అని చెప్పాలనుకున్నాడు. కాని కారుణ్య చేసిన ఈ సాహసంతో కాలుకాలిన పిల్లిలా తిరగసాగాడు.

ఆకుపచ్చని రంగు శాలువా నిండుగా కప్పుకున్న కారుణ్య సన్నగా పొడుగ్గా ఉంది. సూరన్నతాత కాళ్ల దగ్గర మంచం మీద కూర్చుని కాళ్లు పట్టడంతో తాతయ్య కాళ్లు చాచాడు 'ఎవరునువ్వు' అన్నట్టు ఒకసారి ఆమె ముఖంలోకి చూశాడు గాని ఆ ప్రశ్నను పెదాలు పలకలేకపోయాయి. తాతయ్య కాళ్ల మీద ఆమె చేతి గాజులు గల గలమన్నాయి.

తాతయ్య తనని ఏవగించుకోవచ్చుననీ, కోప్పడవచ్చుననీ, రకరకాల ప్రశ్నలు అడగవచ్చుననీ మనసు — అనేక విధాలుగా సందేహపడింది. ఆ పరిస్థితికి సిద్ధపడింది. కాని తాతయ్య నించి ఏ వ్యతిరేకతా లేకపోయేసరికి కారుణ్యకి ధైర్యం చిక్కింది. తాతయ్యను తను అడగవలసిన ప్రశ్నలు చాలా ఉన్నాయి. నిద్రలోకి జారిపోయాడేమో అని పరిశీలించి చూసింది. ఇంకా నిద్రపోలేదు. ఇప్పుడు తాతయ్య దృష్టి మనువడి సమస్య మీదికన్నా తన కాళ్లనొప్పుల మీద ఉంది. ఆ అమ్మాయి వచ్చి కాళ్లు పట్టుంటే — తాతయ్యకి ముందుగా తన తల్లి గుర్తొచ్చింది. తన భార్య గుర్తొచ్చింది. తన ఇద్దరు కూతుళ్లు గుర్తొచ్చారు. తనను ప్రేమించిన ప్రేమమూర్తులు వాళ్లే. ఇప్పుడు ఈ బతుకు చివరి ఘడియల్లో — మళ్లీ చాలా ఏళ్ల తర్వాత అట్లాంటి చల్లని అనురాగం... తన మీద అమృతవర్షంగా కురుస్తున్నది.

'తాతగారూ... నిద్ర పట్టిందా ?'

సూరన్నతాత ముఖం మీదికి కప్పుకున్న దుప్పటి పక్కకి తొలగించి కాళ్లదగ్గర కూచున్న కారుణ్య వేపు చూశాడు. చీకటి నీడలో దాగిన ఆమె ముఖం మీద దీపం వెలుతురు రేఖ గీసింది. సన్నని పొడవాటి ముక్కు. ఎత్తయిన నుదురు.

లేదన్నట్టుగా తల ఊపాడు...

'తాతగారూ —మీరు ఇంతసేపూ పశువుల గురించి... మాట అన్నారు కదా.

ఆ పశువుల మంచిబుద్దులు ఈ మనుషులకున్నాయా తాతగారూ' అంది మాటలకు మధ్య మధ్య తడుముకుంటూ కారుణ్య.

సూరన్నతాత మాటాడలేదు. విన్నట్టుకూడా ఊఁ అనిగాని ఆఁ అనిగానీ చప్పుడు చెయ్యలేదు.

'తాతగారూ — పశువులు — తన పిల్లకిచ్చిన పాలుకు — లెక్కకట్టి అప్పు తీర్చు అని చెప్తుందా...?'

కారుణ్య ప్రశ్నలు వింటున్నాడు మూర్తి. ఆమె సాహసం, ఆ ప్రశ్నలూ అతణ్ని వణికిస్తున్నాయి. ఎందుకు ఆ పూర్వాపరాలు మాటాడి ప్రయోజనం ఏమిటి? కొందరి జీవితాలు అంతే. తండ్రీ కొడుకుల మధ్యా, భార్యా భర్తల మధ్యా — అనుబంధ సంబంధాలు కూడా వ్యాపారమే. కొడుకులనీ, కూతుళ్లనీ వ్యాపారసామాగ్రి చేసుకోవడం తప్ప అనుబంధాలు, అనురాగాలూ ఉండవు. ఉద్యోగాలు చేస్తే అదొక సంపాదన. పెళ్లిళ్లు చేస్తే కట్నాలూ, కానుకలూ, ఆస్తూలూ, అవీ సంపాదనలే. ఆ వ్యాపారతత్వాన్ని కాదంటే శత్రుత్వం. తనకు నాన్న అన్న వ్యక్తి లేడని, తనని ఓ వర్తకుడే ఇన్నాళ్లూ పెంచాడని — అందుచేత రుణ గణాంకాలు సబబే అని — ఆ రుణం త్వరలోనే తీర్చుకోవాలనీ నిశ్చయించుకున్న మూర్తికి కారుణ్య ప్రశ్నలు అసందర్భంగా తోచాయి.

'తాతగారూ... నేను ఈ మాటలు చెప్తున్నాను. కోపం రాదుకదా మీకు. ఒకసారి.. నడివీధిలో నలుగురు స్నేహితులతో మీ మనవడు ఉన్నప్పుడు — వాళ్ల నాన్నగారు — అంటే మీ అల్లుడు గారు — ఎదురయి — ఎలాంటి తిట్లు తిట్టారో మీకు తెలుస్తుందా తాతగారూ — మాటలే — ఆ తిట్లే — అయినా మీ మనవడు — నోరెత్తలేదు. తల దించుకున్నాడు. నాన్న కోపం తగ్గి — ఆలోచించుకున్నప్పుడు — తన తప్పు తెలిసిపోతుంది — ఈ కోపం పోతుంది — అనుకున్నాడే గాని ఎదురు చెప్పలేదు...'

'మల్లా ఏమని చెప్పారో — మీకు తెలుస్తుందా తాతగారూ —' అని తన నోటితో కారుణ్య ఆ మాటలు పలకలేకపోయింది.

'కాని తాతగారూ, ఏ పశువూ తన పిల్లని — నీవు చచ్చిపోతే నా పరువు ఉంటాది అని చెప్పదు' కారుణ్య ఒరియా తెలుగు ముద్దు ముద్దుగా ఉంది మూర్తికి.

ఆమె మాటల్లో ఫిర్యాదు ఏమిటో సూరన్న తాతకి అర్థమవుతూ ఉంది.

తాతయ్య కాళ్లు పట్టుతూనే ఉంది. జరిగి మరింత దగ్గరగా కూర్చున్నది. ఆమెకి ఇప్పుడు మరింత చనువు ఏర్పడింది. బలం చిక్కింది. ఈ పోట్లాట అంతటికీ కారణం

తనే అని కదా ఇంతమందిని పంపిస్తున్నది. ఈ పెళ్లి ఇష్టం లేకనే కదా కొడుకు మీద తండ్రి పోట్టాటకు దిగింది. తన భర్త పక్షాన గట్టిగా మాటాడాలన్న ఆవేశాన్ని ఆమె నిగ్రహించుకోలేకపోతున్నది.

సూరన్నతాత పెదవి విప్పలేదు. వింటున్నాడు. ఆలోచిస్తున్నాడు. ఆ అమ్మాయి మాటలు పోట్లాడుతున్నట్టుగా లేవు. బాధను వెళ్లబోసు కుంటున్నట్టుగా ఉన్నాయి. ప్రేమతో తల్లితో తండ్రితో తన కష్టసుఖాలను చెప్పుకుంటున్నట్టున్నాయి. మంచీ చెడ్డా ఆలోచించమని కోరుతున్నట్టున్నాయి.

'కునుకు పట్టున్నది తల్లీ...' అని ఇంకా చాల్లే అన్నట్టుగా చేతితో చెప్పాడు సూరన్నతాత.

అప్పటికే కారుణ్యకి తనలోని ఆవేశం తగ్గినట్టయింది. తాతయ్య చాల్లే అన్నా మరికొంచెం సేపు కాళ్లుపట్టి —'పడుకో తాతయ్యా' అని లేచి తలుపు దగ్గరగా వేసి బయటకు వెళ్లిపోయింది. నూకయ్యగారి ప్రార్థన ఇంకా సాగుతూనే ఉంది.

అప్పటికే జాబిలి నడినెత్తిమీదికి వచ్చి శీతలహిమపవనాలకు వణుకు తున్నాడు.

'అవన్నీ ఎందుకు? ఇప్పుడు అడగాల్సిన అవసరం ఏమిటి చెప్పు?' అని నొచ్చుకున్నాడు మూర్తి. ఆమె రెండు చేతులూ పట్టుకుని 'ఎలా జరిగితే అలా జరగనీ —మనం చేసింది చెడ్డ అయితే ఆ ఫలితం మనమే అనుభవిస్తాం. మంచే అయితే భగవంతుడు మనకి మేలే చేస్తాడు. ఆ ఫలితం కూడా అనుభవించేది మనమే.' అని తాతయ్యతో కారుణ్య మాట్లాడుతున్నప్పుడు — ఆమె ఆందోళననీ, ఆవేదననీ గమనించి ఓదార్చాడు మూర్తి.

* * *

ఇంకా సూర్యోదయం కాలేదు. కాని ఉషోదయశోభతో జగత్తంతా రంగులు వెదజల్లినట్టుగా సుందర దృశ్యాలు. ఎటు చూసినా వరిచేలతో పచ్చని పంట పొలాలు. మధ్య మధ్య చెరకుతోటలు. దూరంగా దట్టమైన కొండలు, అడవులు. తోటలో పూలమొక్కల మధ్య తిరుగుతున్నారు నూకయ్యగారు. నిద్రలేచిన వెంటనే ఒకసారి తోటలో పూలమొక్కల మధ్య ఉన్న తన గురువుగారి సమాధి ముందు వందనం చేసి రావటం వారి తొలి కార్యక్రమం. ఆ మొక్కలన్నీ ఆయనతో మాట్లాడుతాయి. 'ఆ నువ్వు పూసావా ఈ రోజు. అబ్బో ఎన్ని మందారాలో ఇవాళ. పంచముఖి మందారం అంటే ఇష్టం. కొమ్మల్ని పట్టుకుని మరీ మాట్లాడుతారాయన. మల్లెలూ, చామంతులూ, గులాబీలూ, బంతిపూలు —ఆయనతో పాడుకుంటాయి, ఆడుకుంటాయి. అట్లా పది నిమిషాల పాటు ప్రతి మొక్కనీ లాలించి వస్తారాయన.

పావురాలు మూలుగుతున్నాయి. కాకులు కఠోరంగా అరుస్తున్నాయి. ఆ అరుపు చెవిన పడి నిద్రమత్తు వదిలినట్టుగా కళ్లు విప్పి పావురాల వేపు గుడిగోపురం వేపు చూశారు. భయపడ్డారు. పావురాలను పిలుస్తూ వెతుకుతున్నారు. ఏదో పావురం దెబ్బతిన్నదని అనుమానం.

మూర్తి ముఖాన్ని నిండా కప్పుకుని ఇంకా నిద్ర పోతున్నాడు.

దండాశి మంటపెట్టి నీళ్లు కాస్తున్నాడు.

సూరన్నతాత వేణ్ణీళ్లతో ముఖం కడుక్కుంటున్నాడు.

కొండలనించి వీస్తున్న రొజ్జగాలి చివరి తీవ్రత చూపిస్తున్నది.

మూర్తికి మెలుకువ వచ్చేసరికి నూకయ్యగారి గొంతు వినిపించింది. సూరన్నతాత ప్రశ్నలకి ఆయన సమాధానం చెప్తున్నట్టున్నారు. తన తిరుగు ప్రయాణానికి బస్సు వేళల గురించి తాతయ్య అడిగినట్టుంది. బస్సుల రాకపోకల వివరాలు చెప్తున్నారు నూకయ్యగారు.

ఒక్కొక్కసారి జీవితంపట్ల అసహనభావం ఏర్పడుతుంది. రాత్రి తాతయ్య వచ్చిన తర్వాత మనసంతా గాయపడినట్టుగా ఉంది మూర్తికి. తాతయ్యను చూసినప్పుడల్లా అమ్మగుర్తొస్తుంది. పసితనంలోనే చనిపోయిన తల్లి స్థానంలో తాతయ్య కన్పిస్తాడు. అంత ప్రేమమూర్తి సైతం తనను తప్పు పట్టడం మూలంగా జీవితం కొన్నిసార్లు ఎక్కడో దారి తప్పినట్టు అన్పిస్తుంది. సాయంకాలాలు ఇల్లు చేరుకునేసరికి ఆత్రపడేతల్లి, కొడుకు ప్రయోజకత్వంతో మురిసిపోయే తండ్రీ, ప్రేమతో, పోట్లాటలతో, పట్టింపులతో, రాగానురాగాలతో తమ్ముళ్లు, చెల్లెళ్లు, భార్యా పిల్లలూ ఒక పొందికయిన సంసారం - కుటుంబం — తన వరకు స్వప్నమే... కాని దాని కన్నా గొప్పదీ, బలమైనదీ తన ఆదర్శం. ఇప్పుడున్న తన జీవితం తాను వరించి స్వీకరించిందే. ఇప్పుడు ఎదురయిన సంక్షోభం అంతా కూడా తనకు సవాల్‌గానే నిల్చింది. అందుచేత ఇంకా దృఢంగా, ఇంకా ఉన్నతంగా, ఇంకా సాహసోపేతంగా —తన ఆదర్శాలను జీవితంలో స్వీకరించాల్సిందే తప్ప ఈ మమకారాల ముందు తలవొగ్గకూడదు.

ఆ అమ్మాయి ఉండనీ. నిన్ను నమ్మి వచ్చిన పిల్ల... ఉండనీ. కాని మన కుటుంబ గౌరవం కోసం పెళ్లి చేసుకో అన్న రాయబారాల కొత్త అస్త్రం తన మీద పని చెయ్యలేదని తెలిసిన దగ్గర్నించి మరింతగా ఉద్రేకాలు పెరిగాయి. ఆ ఘట్టంలోనే తాతయ్య వచ్చాడు.

కళ్లు నిద్రను జార్చుకుని తెరచి చూసే సరికల్లా స్నానం చేసి తడిచీరతో అప్పుడే

గదిలోకి వస్తున్న కారుణ్య కన్పించింది. లేతాకు పచ్చరంగు చీర ఆమె అవయవాలకు అతుక్కుపోయి కళాశిల్పంలా కన్పించింది. 'ఇంత చలిలోనా స్నానం అబ్బ !' అని గొణిగాడు మూర్తి. అమె నవ్వుకుంది. ఆ నవ్వుచాలు తన జీవితానికి!

తాతయ్యా రాత్రీ —జ్ఞాపకం!

తాతయ్యా తెచ్చిన సమస్యలు...

ఆ సమస్యలకు తన సమాధానం ఒక్కటే.

తండ్రీ కొడుకుల మధ్య బాంధవ్యం అనురాగబాంధవ్యంగానే సాగాలి తప్ప ఆస్తి సంబంధం కాకూడదు. సంసారపు ఆస్తి సంకెళ్లకు ఈ అనుబంధం చిక్కకూడదు. కుటుంబంలో ఆస్తిహక్కుల హద్దులను ఉల్లంఘించడమే తన లక్ష్యం. ప్రేమానుబంధాలే ఆస్తి. జీవితాలను సంకుచితపరచే ఇరుకు సాంఘికా చారాల పెత్తనం సాగకూడదు. కొత్తవిలువలతో జీవితం విశాలం కావాలి. ఆ ఆశయాన్ని ప్రేమించి జీవించటంలో తనకు శాంతి సంతోషాలున్నాయి.

సూర్యకాంతితో ప్రపంచం గొప్ప అందాలతో వెలిగిపోతున్నది.

మూర్తి తన మనోభావాలను జంకుగొంకు లేకుండా చెప్పేయాలనుకుని నిర్ణయించుకున్నాడు. ఈ రాయబారాలు ఇంతటితో చెల్లు అని స్పష్టం చెయ్యాలనుకున్నాడు.

తాతయ్య మీద తాను రాత్రి నెగ్గినందుకు కారుణ్య మనస్సు నిర్భయంగా ఉంది. ఆ నిర్భీతి ఆమె చూపుల్లో కన్పిస్తున్నది. తనే పిరికి వాడయ్యాడు. జడుసుకున్నాడు. సహజంగానే కొన్ని బంధాలు తెగిపోతున్నాయి. వాటిని త్వరగానే తెంచేసుకోవాలి. ఈ నిర్ణయం ఇంతకు ముందే తీసుకుని ఉంటే — ఈ రాయబారాలు కొనసాగేవి కావు.

కాఫీ అందరికీ ఇచ్చింది కారుణ్య.

దండాశి మందారాల నిలువెత్తు హారం దేవికోసం కట్టాడు.

మందిరం తలుపులు తెరచి పూజ ఏర్పాట్లు చేస్తున్నారు నూకయ్యగారు. కారుణ్య ఇచ్చిన కాఫీని తోటలోని సమాధి వేపు తీసుకుని వెళ్లారాయన. తను తినబోయే ప్రతిదాన్నీ తన గురువుగారి సమాధి ముందుపెట్టి నమస్కరించి తినటం ఆయన అలవాటు.

తోటల్లోంచి కాఫీగ్లాసుతో వచ్చిన నూకయ్యగారు 'చూశారా ఆ తెల్ల పావురం పిల్లని డేగ ఎత్తుకుపోయింది. ఇన్ని పావురాలు ఉండి ఏం చేశాయి? కాపాడ గలిగాయా? తమ ప్రాణాలకెక్కడ ఆపద వస్తుందో అని భయపడ్డాయి. ఇప్పుడు మళ్లీ

వాటిపనుల్లో అవి మునిగిపోయాయి... అంతేనండి మనజీవితం...' అని కాఫీ గ్లాసును నోటి దగ్గర పెట్టుకున్నారు.

'అల్పజీవి' అని ఆ పావురం పిల్లనే గుర్తుతెచ్చుకుంటున్నారాయన.

తను వెళ్లాల్సిన బస్సు ఈ ఊరు రావటానికి ఇంకా మూడు గంటలకు పైనే ఉంది. కారుణ్య వంట ఏర్పాట్లు చూస్తున్నది. సూరన్న తాత ఆలోచనల్లో నిండా మునిగిపోయాడు. తన ముందున్న దేవీమందిరం గాని, తన ఎదుట కూర్చుని కాఫీ తాగుతున్న నూకయ్యగారు గాని, వంటపనులతో తిరుగుతున్న కారుణ్యగాని ఆయనకు కన్పించటం లేదు. జీవితం తనకు బోధించిన సత్యం ఏమిటో —తాతయ్య కళ్లల్లో అశ్రువులు నిండటం కారుణ్య చూసింది. తాతయ్య కన్నీటికి తానే కారణం అనిపించిందేమో అమెకు హృదయం చివుక్కుమంది. ఆ బాధతో ఆమె కనుకొలకుల్లో దుఃఖం సుళ్లు తిరిగింది.

సూరన్నతాత నిన్న సముద్రమంత అవమానాన్నీ, ఆకాశమంత అశాంతినీ మోసుకుని ఇక్కడకు వచ్చాడు. ఇప్పుడు ఈ ఉదయం సూర్యకాంతివంటి సౌందర్యాన్నీ, సంగీతంలాంటి ప్రశాంతినీ నింపుకుని హృదయం పులకించ సాగింది.

ఉదయమంతా —బస్సు వచ్చే వేళ వరకూ —సూరన్నతాత —మందిరంలో దేవీ పూజతో గడిపాడు. నూకయ్యగారు దేవి గురించి చెప్పిన కథలన్నీ వింటూ దేవీముందే కూర్చున్నాడు. తన అలవాటు ప్రకారం వేళకి భోజనం చేశాడు. మూర్తీ, కారుణ్యా ఈ ఒక్కరోజు ఇక్కడ ఉండి రేపు వెళ్లు తాతయ్యా అని ఎంత బతిమాలినా మనసు మార్చుకోలేదు. తన చేతికర్రను తీసుకుని బస్సుకోసం రోడ్డు వేపు కదిలాడు. 'అన్నీ నీవే స్వామి' అని నూకయ్యగారితో చెప్పి తిరుగుదారి పట్టాడు. ఆయన వెంట నూకయ్యగారూ, దండాశీ, కారుణ్య, మూర్తీ —సాగనంపటానికి వెళ్తున్నారు.

మందిరంలో దేవీ పాదాల చెంత పూజలో నించి తీసి నూకయ్యగారు పెట్టిన రెండుపూలు —చేమంతీ మందారం —సూరన్న తాతకి తన చేతిలో పదేపదే కన్పిస్తున్నాయి.

మందిరంలోపల విగ్రహరూపంలో ఉన్న దేవి, మందిరం బైట కూడా మారు రూపంతో తిరుగాడుతున్నట్టు కండ్లముందే కనిపించింది.

***

ప్రచురణ 'భారతి' సాహితీ మాస పత్రిక

మే*1961*